సాక్షి
విశాఖపట్నం
శనివారం । 27 । జూలై । 2024



విశాఖ తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఆర్‌కే బీచ్‌లోని యుద్ధ స్మారక చిహ్నం వద్ద 50 మంది సిబ్బంది పరేడ్ నిర్వహించి కార్గిల్ యుద్ధ వీరులకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, నేవీ ఫౌండేషన్ అధ్యక్షుడు వైస్‌అడ్మిరల్ వీకే నంబల్లా (రిటైర్డ్), బ్రిగేడియర్ జేకే బారువా, వింగ్ సీడీఆర్ పి.శ్యామ్‌కుమార్, జిల్లా సైనిక్ **వెల్ఫేర్ ఆఫీసర్ జి.సత్యనాథం తదితరులు స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచిమౌనం పాటించారు.**

- బీచ్ రోడ్డు

కళాభారతిలో కార్గిల్ దివస్ సందర్భంగా దేశభక్తి గీతానికి నృత్యరూపకం

సాహో సైనికా..



కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులర్పిస్తున్న నావికాదళ సిబ్బంది


కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులర్పిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా, సీపీ శంఖబ్రత బాగ్చి తదితరులు



● మన..సారె సమర్పణ

పెదవాల్తేర్ గ్రామ దేవత శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి సారె ఊరేగింపు కనులవిందుగా సాగింది. 20వ వార్డు పెదవాల్తేర్‌లోని పెద్దింటి నుంచి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సారె ఊరేగింపు శుక్రవారం ఉదయం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

-ఎంవీపీకాలనీ

'తోలు' తీసేందుకు మళ్లీ టెండర్!


అగనంపూడి టోల్‌ప్లాజా

- జాతీయ రహదారి హోదా లేని మార్గంలో ఇప్పటి వరకు టోల్ వసూలు
- అంగనంపూడి టోల్ బూత్‌ను ఇటీవల ధ్వంసం చేసిన స్థానికులు
- తాజాగా టెండర్లు పిలిచిన ఎన్‌హెచ్‌ఏఐ
- అధికారుల తీరుపై విశాఖ వాసుల మండిపాటు

అగనంపూడి : టోల్ పీడ విరుగడైందని సంతోషంలో ఉన్న విశాఖ వాసుల నెత్తిన పిడుగు పడింది. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అగనంపూడి టోల్ ప్లాజా పునఃప్రారంభానికి టెండర్లు ఆహ్వానించడంతో అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత నెల 26వ తేదీ తెల్లవారు జామున కొంతమంది స్థానికులు అగనంపూడి టోల్ ప్లాజా బూత్‌లను ధ్వంసం చేశారు. ఈ విషయమై నగర పోలీస్ కమిషనర్‌కు హైవే అథారిటీ అధికారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేదు. అన్ని వర్గాల ప్రజలపై మోయలేని టోల్ భారం పడుతుండటంతో పోలీసులు మిన్నకుండిపోయారు. టోల్ ప్లాజాను బంగారు గుడ్లు పెట్టే బాతులా మార్చుకున్న ఎన్‌హెచ్‌ఏఐలోని కొంతమంది ఉన్నతాధికారులు.. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మంతనాలు జరిపి టెండర్లు పిలిచారు. టోల్ గేటు ముగిసిన కథ అని భావించిన స్థానికులకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల తీరు మింగుడు పడటం లేదు. ఈ నెల పదో తేదీన టోల్‌ప్లాజా నిర్వాహణకు బిడ్లు ఆహ్వానించడంతో అగనంపూడి టోల్‌ప్లాజా వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. రూ.81 కోట్ల అంచనా రాబడితో కేంద్ర రవాణా శాఖా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) టెండర్లు పిలవడంతో కూటమి ప్రభుత్వ నాయకులతో పాటు ప్రజా సంఘాలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ గెజిట్‌లో పేర్కొన్నా..

జీవీఎంసీలో టోల్‌గేట్లు నిర్వహించడం ఎన్‌హెచ్‌ఏఐ చట్టానికి విరుద్ధం. అలాగే జాతీయ రహదారి హోదా ఈ మార్గానికి లేదని ప్రభుత్వం గెజిట్‌లో పేర్కొన్నాక టోల్‌ప్లాజా కొనసాగించడం మరో విడ్డూరం. ఆనందపురం నుంచి అనకాపల్లి వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయ్యాక అనకాపల్లి సమీపంలో టోల్‌గేటు ఏర్పాటు చేశాక అగనంపూడి టోల్‌ప్లాజాను తొలగిస్తామని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు ప్రాజెక్టు అధికారులు రాతపూర్వకంగా హామీ ఇచ్చారు.

ఆ హామీని నెరవేర్చకపోవడంతో 2019లో గాజువాక బార్ కౌన్సిల్ హైకోర్టులో కేసు వేసింది. అనుకూలంగా తీర్పు రావడంతో అప్పట్లో అగనంపూడి టోల్ ప్లాజాను తొలగించారు. అయితే కొంతమంది ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, నాయకులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై సుప్రీంకోర్టులో కేసు వేసి కొనసాగించేలా స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు.

రహదారి విస్తరణకు చేసిన అప్పు తీరేనా!

టోల్ ఫీజు వసూళ్ల విషయంలో ఆది నుంచి కట్టు కథలే చెబుతూ వస్తున్నారు. నాలుగేళ్ల కిందట పార్లమెంట్ సాక్షిగా అధికారులు మంత్రితో అబద్ధాలు వల్లె వేయించారు.. కేవలం రూ.23 కోట్లే అప్పు తీరిందని. వాస్తవంగా రహదారి విస్తరణకు చేసిన అప్పు రూ.63 కోట్లు. మరి ఈ ఏడాది అంచనా బిడ్ రూ.81 కోట్లు. గత ఏడాది రూ.76 కోట్లు. అధికారిక లెక్కల ప్రకారం వెయ్యి కోట్లకు పైగా హైవే ఖాతాలో జమైంది. అయినా ఎందుకు మంత్రితో అబద్ధాలు చెప్పించారు? ఎందుకంటే ప్రభుత్వ ఖజానాలో జమ అయిన డబ్బుల కంటే రెండింతల సొమ్ములు పాలకుల, అధికారుల, కాంట్రాక్టర్ల జేబుల్లోకి చేరడమే అసలు విషయమని ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా, టోల్‌గేటు కొనసాగింపునకు అనుమతినిస్తే జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి పనులు చేపడతారట. ఫ్లైఓవర్ల నిర్మాణానికి వసూలైన నిధులు వెచ్చిస్తారట. ఇదీ రాష్ట్ర ప్రభుత్వానికి చెబుతున్న మరో కట్టు కథ. అసలు స్థానిక ప్రభుత్వ అభివృద్ధితో ఈ సంస్థకు పనేంటి? టోల్ ప్లాజా కొనసాగించడం వల్ల అనధికారికంగా వచ్చే కోట్లాది రూపాయలు ఆగిపోతాయనే రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను ఇలా మభ్యపెడుతున్నారన్న విమర్శలున్నాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి రైతు బజార్లలో కిలో రూ.30కే టమాటాలు

మహారాణిపేట: జిల్లాలో అన్ని రైతు బజార్లలో శనివారం నుంచి కిలో రూ.30కు టమాటాలను విక్రయించనున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో టమాటా ధర విపరీతంగా పెరుగుతున్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు తగ్గింపు ధరతో విక్రయించనున్నామన్నారు. బుధవారం రూ.38లకు విక్రయించామని, ధరలు తగ్గడంతో ఇప్పుడు రూ.30కు విక్రయిస్తున్నామన్నారు.

ఏడుగురు బెటాలియన్ అధికారుల బదిలీ


బదిలీ అయిన అధికారులను సత్కరిస్తున్న బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ పద్మనాభరాజు

పీఎం పాలెం: జీవీఎంసీ 7వ వార్డులోని ఏపీఎస్‌పీఎఫ్ 16వ పోలీస్ బెటాలియన్‌లో పనిచేస్తున్న ఏడుగురు అధికారులు బదిలీ అయ్యారు. ముగ్గురు ఆర్‌ఐలు, నలుగురు ఆర్‌ఎస్‌ఐలను ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ డిపార్టుమెంట్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం బదిలీ అయిన అధికారులను 16వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ నారాయణ, దేవానంద్, పి.సత్యం, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను విధానంపై అవగాహన


పన్ను విధానంపై, ఆదాయ పన్నుపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌కంటాక్స్ అధికారులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం ఆదాయ పన్నుల శాఖ సహకారంతో వాల్తేర్ డివిజన్ పరిధిలోని పన్ను చెల్లింపుదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో నిర్వహించారు. రైల్వే ఉద్యోగులకు పన్ను విధానంపై ప్రాముఖ్యత తెలియజేసి, వారికి అవగాహన కల్పించారు. సకాలంలో ఇన్‌కం టాక్స్ రిటర్న్సు ఎలా దాఖలు చేయాలో, ఎలా మదింపులు పొందవచ్చో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కంటాక్స్ (విశాఖ) పీవీ శేషగిరిరావు తెలిపారు. వీరితో పాటు అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్స్ వేంకటేశ్వరరావు, డీవీ అప్పారావు, అనిరుథ్ ఆత్రేయలు ఆదాయ పన్నుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాల్తేర్ డివిజన్ ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శిరస్త్రాణమే రక్షణ కవచం

● డీటీసీ రాజారత్నం

గోపాలపట్నం: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం సూచించారు. మాధవధారలో రవాణా శాఖ కార్యాలయంలోని రహదారి భద్రత శిక్షణ కేంద్రంలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఐఎస్ హెల్మెట్లు మాత్రమే వినియోగించాలని, 4151:2015 గల హెల్మెట్లు నాణ్యమైనవని తెలిపారు. కొనుగోలు చేసినపుడు ఈ నంబర్‌ను సరి చూసుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపితే రూ.1000 జరిమానాతో పాటు మూడు నెలల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఈ కేంద్రం ఏర్పాటు చేసిన నాటి నుంచి 94, 327 మందికి రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

అమ్మాయిల ఫొటోలు పంపించి.. రూ.28 లక్షలు కాజేసి..

- ఇంజినీర్‌ను బురిడీ కొట్టించిన ముఠా
- తెలంగాణ వాసి అరెస్ట్.. పరారీలో ఇద్దరు


వివరాలు వెల్లడిస్తున్న సైబర్ క్రైం సీఐ భవానీ ప్రసాదరావు

మధురవాడ: తెలంగాణకు చెందిన ఓ ముఠా అందమైన అమ్మాయిల ఫొటోలతో ఓ ఇంజినీర్‌ను బురిడీ కొట్టించింది. ఎమోషనల్‌గా అతన్ని బ్లాక్ మెయిల్ చేసి రూ.28 లక్షలు కాజేసింది. మోసపోయానని ఆలస్యంగా గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం బయటపడింది. ఈ కేసులో ఒకరిని అరెస్ట్ చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఎండాడ దిశ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సైబర్ క్రైం సీఐ భవానీప్రసాద్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన కృష్ణ మనోజ్ మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి వివాహం కాలేదు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కొమ్మగోని లోకేష్, సాయిధీరజ్, మైకల్ షాలిని ముఠాగా ఏర్పడ్డారు. డేటింగ్ యాప్ ద్వారా కృష్ణ మనోజ్‌ను పరిచయం చేసుకున్నారు. తర్వాత నకిలీ ఇన్‌స్టా గ్రామ్ ఐడీని అతనికి ఇచ్చి.. చాటింగ్ మొదలు పెట్టారు. అతనితో మరింత పరిచయం పెంచుకుని ఫోన్ నంబర్ సంపాదించారు. వాట్సాప్‌లో చాట్ చేసి అందమైన అమ్మాయిల ఫొటోలు పంపించి ఎమోషనల్‌గా దగ్గరయ్యారు. ఇలా చాటింగ్ చేస్తూనే.. డబ్బులు అవసరమని నమ్మించి రూ.28లక్షలు కాజేశారు. మోసపోయానని ఆలస్యంగా గ్రహించిన బాధితుడు నగరంలో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రంగారెడ్డి జిల్లా ఎల్‌బీ నగర్, మన్సురాబాద్‌కి చెందిన కొమ్మగోని లోకేష్(25)ను అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు షాలిని.. లోకేష్, సాయిధీరజ్‌పై హైదరాబాద్‌లోని పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టడం గమనార్హం.

అప్రమత్తంగా వ్యవహరించండి

సైబర్ మోసాలు చాలా విస్తృతంగా జరుతున్నాయని, వాటి పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలని సీఐ భవానీప్రసాద్ నగర ప్రజలను హెచ్చరించారు. ఏపీకే లింక్‌లు వంటి వాటి ఓపెన్ చేయవద్దని సూచించారు.సైబర్ మోసగాళ్లు డబ్బులు కోసం డేటింగ్ యాప్, మ్యాట్రిమోనీ, ఇతర మార్గాల ద్వారా పరిచయం పెంచుకుని మోసగిస్తున్నారని హెచ్చరించారు. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు 13 వేల మంది మోసపోయారని, సుమారు రూ. 21 కోట్ల వరకు నగదు రికవరీకి చర్యలు చేపట్టామన్నారు. డబ్బులు పోగొట్టుకున్న గంటలోపే పోలీసులకు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేయాలని సూచించారు. ఆలస్యమైతే మోసగాళ్లు కొట్టేసిన నగదు 13 లేయర్స్‌గా వివిధ ఖాతాల్లోకి జమ అయి.. క్రిప్టోకరెన్సీగా మారిపోతుందన్నారు. ఈ కేసును ఛేదించిన ఏఎస్ఐ శ్రీనివాసరావు, పీసీలు సత్యనారాయణ, శేఖర్‌లను సీపీ శంఖబ్రత బాగ్చి అభినందించారు. సమావేశంలో ఎస్ఐ మహేష్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో మెరుగైన ఫలితాలు

● డీఈవో చంద్రకళ


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈవో చంద్రకళ

మధురవాడ: సీబీఎస్‌ఈలో మెరుగైన ఫలితాలు సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులంతా సమష్టిగా పనిచేయాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీఈవోలో విశాఖ, అనకాపల్లి జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాల ఉపాధ్యాయులకు శుక్రవారం నిర్వహించిన ఒక్కరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఇక్కడ ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్‌కల్ సైన్స్, బయాలజీ, సోషల్ సబ్జెక్టులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీబీఎస్‌ఈ పరీక్షలు, మార్కులు, ప్రశ్నాపత్రాలు, ఇంటర్నల్ మార్కులు తదితర అంశాలపై ముందుగా ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ సబ్జెక్టుపై విద్యార్థి పట్టు పెరిగేలా చూడాలన్నారు. స్టేట్ సిలబస్‌తో పోల్చుకుంటే ఒక రకంగా ఇదే సులువైందని చెప్పవచ్చని.. అయితే పరీక్షల్లో కచ్చితంగా లాంగ్వేజెస్‌లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. సీబీఎస్‌ఈ బోధనలో అపారమైన అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో ఇస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏమైనా సందేహాలు ఉంటే నిర్మోహమాటంగా అడిగి నివృత్తి చేసుకోవాలని, విద్యార్థులకు చక్కగా బోధన చేయాలన్నారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ విశాఖ, అనకాపల్లి జిల్లాల సమన్వయకర్త ఎస్. రూపావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డీడీ కె.శ్రీదేవి, ఎస్ఎస్ఏ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల డీసీవోలు బాలాజీ నాయక్, టీఎం ఫ్లోరెన్స్, విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, కొమ్మాది జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ఎస్ చంద్రశేఖర్, స్థానిక ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నవనీత వాణి పాల్గొన్నారు.

రేపు 'లివర్ వాక్'

మహారాణిపేట: ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా, ఆంధ్రా మెడికల్ కాలేజీలోని మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం ఆదివారం లివర్ వాక్ నిర్వహించనుంది. ఆదివారం ఉదయం 6 గంటలకు బీచ్‌లో వాక్ నిర్వహిస్తున్నట్టు ఏఎంసీ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ జీవీ గిరినాథ్ తెలిపారు. కార్యక్రమాన్ని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, డాక్టర్ పెదవీరరాజు, డాక్టర్ శివప్రసాద్ ,డాక్టర్ విశ్వనాథ్ పాల్గొంటారన్నారు.

క్యాన్సర్ కారకాలు, అధునాతన వైద్యంపై చర్చ

- నేటినుంచి రాష్ట్రస్థాయి సమావేశాలు
- హాజరు కానున్న 150 మంది మెడికల్, అంకాలజీ వైద్యులు


కేజీహెచ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్ప

మహారాణిపేట : క్యాన్సర్ వ్యాధిపై అధునాతన వైద్య ప్రక్రియలను చర్చించేందుకు విశాఖలో శని,ఆదివారాల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ అంకాలజీ విభాగం, హోమి బాబా క్యాన్సర్ ఆస్పత్రి సంయుక్తంగా ఆంధ్ర మెడికల్ కాలేజీలో నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఏపీ చాప్టర్ సమావేశాలు నిర్వహించనున్నట్టు ఏఎంసీ అంకాలజీ విభాగాధిపతి (హెచ్‌వోడీ) డాక్టర్ కె.శిల్ప తెలిపారు. రెండు రోజులు పాటు జరగనున్న ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 150 మంది మెడికల్ సర్జికల్, అంకాలజీ వైద్యులు పాల్గొంటారని తెలిపారు. గత ఏడాది గుంటూరులో జరిగి నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఏపీ చాప్టర్ మొదటి సమావేశంలో మహిళల్లో పెరుగుతున్న బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లపై చర్చించారు. ఇప్పుడు విశాఖలో జరగనున్న రెండో సమావేశంలో ఐదు రకాల క్యాన్సర్ల చర్చించనున్నట్ట డాక్టర్ శిల్ప చెప్పారు. బ్లడ్ క్యాన్సర్‌లో రకాలు, అండాశయ క్యాన్సర్, పెద్ద పేగు క్యాన్సర్, బోన్ మ్యారో క్యాన్సర్లలో అధునాతన వైద్యంపై చర్చించనున్నామన్నారు. శనివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం వరకు పలు అంశాలపై చర్చ జరగనుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టీ.కృష్ణబాబు, ఆరోగ్యశ్రీ రాష్ట్ర సీఈవో డాక్టర్ లక్ష్మీ షా హాజరవుతున్నట్టు డాక్టర్ శిల్ప వివరించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఈఎంఈ డాక్టర్ నరసింహం, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిబాబు పాల్గొంటారన్నారు.

పోలమాంబకు మన'సారె' సమర్పణ



ఊరేగింపుగా సారెను తీసుకొస్తున్న మహిళలు



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాటం

ఎంవీపీకాలనీ: పెదవాల్తేరు గ్రామ దేవత శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి సారె ఊరేగింపు కనులవిందుగా సాగింది. 20వ వార్డు పెదవాల్తేరులోని పెద్దింటి నుంచి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ సారె ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో వివిధ రకాలు పండ్లు, స్వీట్లు, పువ్వులు, వస్త్రాలతో సారెను శిరస్సుపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. మంగళ వాయిద్యాలు, కోలాటం నృత్యాలు నడుమ సారె ఊరేగింపు పోలమాంబ ఆలయం వరకు సాగింది. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి.. సారెను వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అద్భుతం 'శ్రీకృష్ణరాయబారం'

హరికథ ఉత్సవాలు ప్రారంభం



హరికథను వినిపిస్తున్న మొగిలిచర్ల నాగమణి భాగవతారిణి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హరికథ ఉత్సవాలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్యనారాయణరాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ ప్రారంభించారు. అనంతరం మొగిలిచర్ల నాగమణి సుస్వరంతో శ్రీకృష్ణ రాయబారం హరికథను వీనులవిందుగా వినిపించారు. చక్కని కథనంతో ఆసక్తిని రేకెత్తించేలా ఎంతో అద్భుతంగా కథను నడిపించారు. కౌరవ పాండవులు చిన్నప్పటి నుంచి కలసిమెలిసి విద్యాభ్యాసం చేసిన విధానం చెప్పి తీరు.. వీక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.

పీఎఫ్ నాన్ రిటర్నబుల్ రుణాలు నిలిపివేత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) నాన్ రిటర్నబుల్ రుణాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ మేరకు పీఎఫ్ ట్రస్ట్ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి యాజమాన్యం నుంచి ట్రస్ట్‌కు రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి రుణాలు ఇవ్వడం ట్రస్ట్‌కు భారంగా మారింది. అయినప్పటికీ విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు, రిటర్నబుల్ రుణాలు ఇప్పటి వరకు పెండింగ్ లేకుండా చెల్లించారు. ప్రస్తుతం ట్రస్ట్‌కు నిధుల కొరత ఏర్పడడంతో తాత్కాలికంగా నాన్ రిటర్నబుల్ రుణాలు నిలిపి వేశామని, నిధులు సమకూరిన తర్వాత మళ్లీ రుణాలు చెల్లిస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

ఉక్కు యాజమాన్యానికి పీఎఫ్ కమిషనర్ షోకాజ్ నోటీసు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) రీజినల్ కమిషనర్ షోకాజ్ నోటీసు అందజేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఉక్కు ఉద్యోగుల పీఎఫ్ రికవరీ, యాజమాన్యం వాటాలను స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్ట్‌కు జమ చేయని విషయం తెలిసిందే. దీంతో స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్ట్.. పీఎఫ్ కార్యాలయానికి అప్పటి నుంచి నెల వారి ఆన్‌లైన్ రిటర్న్‌లు దాఖలు చేయడం లేదు. ఈ అంశంపై గత నెలలో పీఎఫ్ కార్యాలయం ట్రస్ట్‌కు నోటీసు ఇచ్చింది. ఈ నోటీసుకు స్పందించిన ట్రస్ట్ ప్రతినిధులు.. యాజమాన్యం పీఎఫ్ నగదును ట్రస్ట్‌కు జమ చేయని విషయాన్ని తెలియజేశారు. దీనిపై స్పందించిన రీజినల్ పీఎఫ్ కమిషనర్-2 డాక్టర్ పవన్‌కుమార్ జాస్తి యాజమాన్యంకు రాసిన లేఖలో వారం రోజుల్లో చెల్లింపులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. లేని పక్షంలో ట్రస్ట్ మినహాయింపు రద్దు చేయడంతో పాటు పీఎఫ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని లేఖలో హెచ్చరించారు.

యువకుడి ఆత్మహత్యకు కారణం ఏంటి?

- పోలీసుల వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ
- భారీ బందోబస్తు మధ్య రోహిత్ అంత్యక్రియలు



రోహిత్ అంత్యక్రియల్లో భాగంగా పోలీస్ బందోబస్తు



మృతుడు రోహిత్(ఫైల్)

మర్రిపాలెం: బాలిక వేధింపుల కేసులో యువకుడి ఆత్మహత్య వ్యవహారం ఇపుడు నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. బాలిక తల్లిదండ్రులతో కలిసి పోలీసుల వేధింపుల కారణంగానే రోహిత్ ఆత్మహత్య చేసుకున్నాడని యువకుడి బంధువుల ఆరోపిస్తుండగా.. అతడి అంత్యక్రియలు భారీ పోలీస్ బందోబస్తు మధ్య నిర్వహించడం చర్చనీయాంశమైంది. బాలికను వేధిస్తున్నాడన్న కారణంతో కంచరపాలెం పోలీసులు రోహిత్(19)పై పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై మనస్తాపం చెందిన రోహిత్ భీమిలి సమీపంలో పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. తీవ్ర గాయాలతో ఉన్న రోహిత్‌ను పోలీసులు కేజీహెచ్‌లో చేర్పించగా.. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఇదిలా ఉంటే.. బాలిక తల్లిదండ్రులు, పోలీసుల కుట్ర కారణంగానే రోహిత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని అతడి బంధువులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి ఇద్దరూ ప్రేమలో ఉన్నారని, అప్పట్లో వారు కలిసి తీసుకున్న ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టడం గమనార్హం. కాగా.. ఇంటర్ వరకు చదివిన రోహిత్ ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు.

సంఘటన స్థలంలో సూసైడ్ నోట్?

రోహిత్ ఆత్మహత్య చేసుకునే ముందు ఒక లెటర్ రాసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సంఘటనా స్థలంలో ఆ సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకు పోలీసులు క్లారిటీ ఇవ్వలేదు. ఇదిలా ఉంటే.. కేజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం శుక్రవారం రోహిత్ బంధువులు మృతదేహంతో కంచరపాలెంలోని బాలిక ఇంటి వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. అయితే ఆ సమయంలో బాలిక కుటుంబం ఇంట్లో లేకపోవడంతో కొంత సేపు ఆందోళన చేసి అంత్యక్రియలకు తీసుకువెళ్లారు. అంత్యక్రియల సమయంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

కొత్త నేర చట్టాలపై ఖైదీలకు అవగాహన

ఆరిలోవ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కొత్త నేర చట్టాలపై ఖైదీలకు అవగాహన అవసరమని సీబీడీ డీఎస్పీ ఎం.ఎస్ భూపాల్ తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీలకు శుక్రవారం సీబీడీ అధికారులు కొత్త నేర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్రిటిష్ కాలం నాటి క్రిమినల్ చట్టాల్లో కొన్ని మార్పులు చేసిందన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సంరక్ష సంహిత, సాక్ష్య అధినీయం చట్టాలను తీసుకువచ్చిందన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి న్యాయ సంహిత చట్టంలో మార్పులు చేసినట్లు తెలిపారు. అలాంటివాటికి శిక్షలను కఠినతరం చేసిందన్నారు. జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.కమల్‌కుమార్, సీబీడీ ఇన్‌స్పెక్టర్లు జె.శ్రీనివాసరావు, బి.సుప్రియ పాల్గొన్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పూండి-నౌపడ సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల కారణంగా పలు రైళ్లను రీషెడ్యూల్ చేస్తున్నట్లు, పలాస-విశాఖపట్నం మెము రైలును గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీన భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12830) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.10 గంటలకు, ఆగస్టు 3న పూరీ-గాంధీధాం (22974) ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా మధ్యాహ్నం 12.45 గంటలకు, భువనేశ్వర్-తిరుపతి (22879) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.10 గంటకు బయలుదేరుతుంది. ఈ నెల 29, ఆగస్టు 1, 3వ తేదీల్లో విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం (07470/07471) మెము శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి రైల్వేకు సహకరించాలని అధికారులు కోరారు.

అంబేడ్కర్ చైర్‌ను సందర్శించిన డీఏఎఫ్ డైరెక్టర్



డీఏఎఫ్ డైరెక్టర్ సిధ్‌కుమార్‌కు పుస్తకాలు బహూకరిస్తున్న ప్రొ. జేమ్స్ స్టీఫెన్

విశాఖ సిటీ: భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్(డీఏఎఫ్) డైరెక్టర్ డాక్టర్ సిధ్‌కుమార్ ఆంధ్రా యూనివర్సిటీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ మేకాతో వివిధ కార్యకలాపాలు, పరిశోధనా కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రొఫెసర్ స్టీఫెన్ చేసిన విస్తృతమైన పరిశోధనా కృషిని ముఖ్యంగా సామాజిక అవసరాలకు టెక్నాలజీని సమన్వయపర్చడంపై చర్చ జరిగింది. అలాగే అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేయడం కోసం చైర్ చేపట్టిన విభిన్న కార్యకలాపాలను వివరించారు. అంబేడ్కర్ చైర్ పనితీరుపై డాక్టర్ సి. ద్‌కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. సామాజిక, న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ లక్ష్యాలకు అనుగుణంగా చైర్ కార్యకలాపాలను నిర్వహించడంలో ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ వినూత్న నాయకత్వాన్ని, నిబద్ధతను ప్రశంసించారు. డాక్టోరల్ ఫెలోస్ యడాల ప్రవీణ్‌కుమార్, కువలరాజ్‌కుమార్‌ల పరిశోధన నాణ్యతపై విలువైన మార్గదర్శకాలను అందించారు. ఈ సందర్భంగా సిధ్‌కుమార్‌ను చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ సన్మానించారు. ఆయన రచించిన రెండు పుస్తకాలను బహూకరించారు.

కార్గిల్ అమరుల త్యాగం స్ఫూర్తిదాయకం

- సీపీ శంఖబ్రత బాగ్చి





ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

మద్దిలపాలెం: కార్గిల్ పోరులో అమరులైన వారి త్యాగం యువతరానికి స్ఫూర్తిదాయకమని, దేశం కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. విజయ దివస్ సందర్భంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో యాక్మీ ఆధ్వర్యంలో భారతీయం పేరిట సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి అంశాన్ని అమరు వీరుల త్యాగానికి కొనియాడుతూ సాగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధవీరులను స్మరించుకుంటూ వారి త్యాగానికి ప్రతీకగా ప్రతి ఏడాది విజయదివస్ జరుపుకుంటున్నామన్నారు. తన తాత గోపాల్ చటర్జీ కూడా అండమాన్ జైలుకు వెళ్లారని గుర్తు చేసుకున్నారు. అనంతరం విశాఖ వ్యాలీ స్కూల్, సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న జవానులు కర్రి వేణుగోపాల్, రతన్‌రాజు, కనకరాజు, సుభాన్ షేక్‌లను సీపీ అభినందించారు. నిర్వాహకుడు ప్రతాప్, వీఎండీఏ చైర్మన్ మంతెన సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.



ఉప్పొంగిన జాతీయభావం

రైల్వే అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో శ్రామిక్ యూనియన్ జయకేతనం

తాటిచెట్లపాలెం: రైల్వే ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ బలపర్చిన అభ్యర్థులు అధిక శాతం డెలిగేట్స్‌గా విజయం సాధించారు. అవిభాజ్య సౌత్ ఈస్ట్రన్ రైల్వే వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో 695 డెలిగేట్స్ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌లో పి.కె.పట్నహాని నాయకత్వంలో శ్రామిక్ యూనియన్ అత్యధిక స్థానాలకు గెలుచుకుందని యూనియన్ డివిజనల్ కో-ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. దాదాపుగా 400పైగా డెలిగేట్స్ తమ యూనియన్ బలపర్చిన అభ్యర్థులే గెలుపొందారని.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని చెప్పారు. కార్మిక సమస్యలపై శ్రామిక్ యూనియన్ చేస్తున్న రాజీలేని పోరాటానికి మద్దతుగా నిలిచి.. ఇంతటి విజయాన్ని అందించిన కార్మికులు, శ్రామిక్ యూనియన్ కార్యకర్తలు, బ్రాంచ్‌ల కార్యవర్గ సభ్యులకు జోనల్ అధ్యక్షులు పి.వి.జె రాజు, జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు, రామ్మోహనరావు ధన్యవాదాలు తెలిపారు.

27 మంది మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 27 మందికి కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 27 మందిని రెండో ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం హాజరు పరచగా న్యాయమూర్తి వారందరికీ మొత్తం రూ.60,500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.68,730
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.63,000
వెండి(కిలో):	రూ.89,000

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.105
స్కిన్	: రూ.180
స్కిన్‌లెస్	: రూ.190

వెన్నునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య



రాజేశ్వరి(ఫైల్)

సబ్బవరం: వెన్నునొప్పి తాళలేక ఓ మహిళ విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. బోదువలసలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలివీ.. గొల్లవిల్లి రాజేశ్వరికి(34)కు బోదువలసకు చెందిన అప్పలరాజుతో 2009లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె రెండోసారి గర్భం దాల్చిన సమయం (2012)లో మేడపై నుంచి జారిపడ్డారు. ఈ ఘటనలో ఆమె వెన్నెముక భాగంలో దెబ్బ తగిలింది. విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి మందులు వాడుతున్నారు. ఈ క్రమంలో డాక్టర్ వెన్నెముకకు ఆపరేషన్ చేయాలని సూచించడంతో.. ఆర్థికస్తోమత లేకపోవడంతో ఆపరేషన్ వాయిదా వేసుకొస్తున్నారు. కాగా.. రెండు రోజులుగా వెన్నునొప్పి తీవ్రం కావడంతో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వాంతులు చేసుకోవడంతో చిన్న కుమార్తె చూసింది. ఈ విషయాన్ని తండ్రి అప్పలరాజుకు సమాచారం ఇవ్వడంతో.. 108లో కేజీహెచ్‌కు తరలించారు. అయితే మార్గమధ్యలోనే ఆమె మరణించారు. భర్త అప్పలరాజు ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన



లక్ష్మీవానిపాలెం విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

పీఎంపాలెం: విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకుడు విజయభాస్కర్ ఆదేశించారు. జీవీఎంసీ 6వ వార్డు పీఎంపాలెంలోని లక్ష్మీవానిపాలెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యాబోధనలో మెళకువలు పాటించాలన్నారు. వివిధ అంశాలపై ఉపాధ్యాయులను ప్రశ్నించిన ఆయన.. అవసరమైన సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి.. రుచికరమైన భోజనం అందజేయాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో-2 అనురాధ, హెచ్‌ఎం లక్ష్మి ఉన్నారు.

బీచ్‌రోడ్డులో షూటింగ్ సందడి



లొకేషన్‌లో నటి సువానా

కొమ్మాది: బీచ్‌రోడ్డులోని మంగమారిపేట రామాద్రి బీచ్ శిలాతోరణం వద్ద శుక్రవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. దర్శక, నిర్మాత ఎన్.కె.సాయి తెరకెక్కిస్తున్న 'పాడేరుకు 12 మైళ్లు' అనే చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. నటీనటులు సత్యం రాజేష్(పొలిమేర ఫేం), సువానాలపై పలు సన్నివేశాలను షూట్ చేశారు. మరో రెండు రోజుల పాటు విశాఖ-భీమిలి బీచ్ ప్రాంతాల్లో షూటింగ్ చేస్తామని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిషేక్ తెలిపారు.